జీహెచ్ఎంసీలో ఘనంగా మహర్షి జయంతి

సిటీబ్యూరో, అక్టోబరు 17(నమస్తే తెలంగాణ): మహర్షి వాల్మీకి రచనలు, సాహిత్య సృష్టికి, భారతీయులందరికీ గొప్ప ఆధ్యాత్మిక ప్రేరణగా నిలిచాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రామాయణ మహా కావ్య రచయిత మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి భారతీయ సాహిత్యానికి ఒక అద్భుతమైన సంపదను అందించారని పేర్కొన్నారు. వాల్మీకి రచనలో వ్యక్తమైన ధర్మబోధలు, ఆధ్యాత్మికత, న్యాయ, నైతిక విలువలు అందరికీ ప్రేరణగా నిలుస్తాయని కమిషనర్ ఇలంబర్తి అన్నారు. వాల్మీకి ఆశయాలను గౌరవించి ప్రతి వ్యక్తి ధర్మం, సత్యం, న్యాయ మార్గంలో నడవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సీఎన్ రఘుప్రసాద్, నళిని పద్మావతి, సీపీఆర్వో మూర్తుజా అలీ, ఏఎంసీలు రమణ, శారద, జీహెచ్ఎంసీ ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరికి రిమాండ్

భువనగిరి అర్బన్, అక్టోబర్ 17 : పట్టణంలోని డాల్ఫిన్ హోటల్ సమీపంలో కిరాణ దుకాణం నుంచి ఓ బాలికను ఎత్తుకెళ్లిన సంఘటనలో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను సఖి కేంద్రానికి పంపినట్లు పట్టణ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కుటుంబం డాల్ఫిన్ హోటల్ సమీపంలో కిరాణం జనరల్ స్టోర్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నది. వారి 15సంవత్సరాల కూతురు ఈ నెల 10న దుకాణంలో కూర్చోగా.. పక్కనే పంచర్ దుకాణంలో పనిచేస్తున్న ఖాజాఖాన్ అమ్మాయిని తీసుకుని పరారయ్యాడు. బాలిక కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతుకగా.. ఆచూకీ దొరకకపోవడంతో ఈ నెల 14న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఖాజాఖాన్ హైదరాబాద్ కంచన్‌బాగ్‌లో తన సమీప బంధువు బురాన్ పాషా ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని ఖాజాఖాన్, బురాన్ పాషాపై ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. బాలికను పట్టణంలోని సఖి కేంద్రానికి తరలించినట్లు సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి : పీఆర్‌పీఎస్

రామన్నపేట, అక్టోబర్ 17 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ప్రజా పోరాట సమితి (పీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో రైతులు పోసిన ధాన్యం రాశులను గురువారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చి 10రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట పీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వరికల్ల గోపాల్, నాయకులు గోగు రమేశ్, నన్నూరి శంకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, అంజయ్య, కాడయ్య, నర్సింహాచారి ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షణ

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 17 : పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం చుట్టూ శ్రీరామ భక్తభజన మండలి ఆధ్వర్యంలో గురువారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందనామాలతో భక్తులు కొండ చుట్టూ ప్రదక్షిణ చేపట్టి వేంకటేశ్వరస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీరామ భక్త భజన మండలి సభ్యులు గడ్డమీది చంద్రయ్య గౌడ్, సామల శ్రీరాములు, పెద్దగాని శ్రీనివాస్, భువనగిరి ఆంజనేయులు, భిక్షపతి, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్, శశిధర్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

లతీఫ్‌బీ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్

'లతీఫ్‌బీ కుటుంబానికి అండగా ఉంటా'

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 17 : మండలంలోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన లతీఫ్‌బీ అనారోగ్యంతో మృతిచెందగా.. ఆమె కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

బీబీనగర్, అక్టోబర్ 17 : మండల కేంద్రంలోని సంజీవయ్య కాలనీకి చెందిన విద్యార్థిని పొట్ట లహరిక మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఐఐటీ జబల్పూర్‌లో సీటు సాధించింది. విద్యార్థిని చదువుకోవడానికి లాప్‌టాప్ అవసరమవడంతో కాలనీకి చెందిన పలువురు యువకులు రూ.20వేల ఆర్థిక సాయం విద్యార్థిని తల్లిదండ్రులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ యువకులు పొట్ట నవీన్, మహేశ్, భాస్కర్, మధు, లింగస్వామి, నరేశ్, చంద్రమౌళి, ప్రేమ్, రాజు, వెంకటేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పెండింగ్ బోధనా రుసుములు, ఉపకార వేతనాలపై

విద్యార్థుల నిరసన గళం

ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల విద్యార్థుల నిరసన ర్యాలీలు, ధర్నా

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లో విద్యార్థుల నిరసన ర్యాలీ

ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడ చౌరస్తా వద్ద బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ విద్యార్థులు

కాప్రా, అక్టోబర్ 17: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, బీఈడీ తదితర కోర్సులకు సంబంధించి రూ.7700 కోట్ల బోధనా రుసుములు, ఉపకార వేతనముల బకాయీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. అఖిల భారత యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పలు కళాశాలల విద్యార్థులు జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తా వరకు సుమారు 400ల మంది బాధిత విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అదే పథకానికి తూట్లు పొడుస్తున్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడాలన్నారు. మూడేళ్లుగా సంక్షేమ విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుములు, ఫీజు బకాయీలు, ఉపకార వేతనాలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, శేఖర్, కార్యవర్గ సభ్యులు మహేష్, సొహైల్, అజీమ్ పాషా, ఆర్తి, ఆస్మా, దేవి, సంధ్య, నీలిమ, కీర్తన, నయన, స్వాతి, మంజులత పాల్గొన్నారు.

జల మండలి కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

జల మండలిలో వాల్మీకి మహర్షి జయంతి

సిటీబ్యూరో, అక్టోబరు 17(నమస్తే తెలంగాణ): జల మండలిలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, ఉన్నతాధికారులు హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు స్వామి, విజయరావు, సీజీఎం ప్రభు పాల్గొన్నారు.

హైదరాబాద్ కలెక్టరేట్‌లో..

మహనీయుల చరిత్ర చదివి స్ఫూర్తి పొందాలని అదనపు కలెక్టర్ కదిరవన్ అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో రామాయణ మహాకావ్య రచయిత మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి అదనపు కలెక్టర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న, సీపీఓ డాక్టర్ సురేందర్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీరామ్, డీపీఆర్ఓ అబ్దుల్ కలీం, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రమేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కదిరవన్, ఉద్యోగులు

ప్రజాస్వామ్యాన్ని కూల్చేలా.. మోదీ వ్యవహారం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి

చిక్కడపల్లి, అక్టోబర్ 17: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కూల్చే విధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపా చట్టాన్ని రద్దు చేయాలి. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఐ రాష్ట్ర కర్యాదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ, వీఎస్ బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, రవీంద్రచారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉపా చట్టంతో దుర్మార్గమైన హింసాకాండను అమలు చేస్తుందని మండిపడ్డారు. ప్రజాస్వామిక వాధులంతా ఏకతాటిపైకి వచ్చి జాతీయ స్థాయిలో ఉపా చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కారణం ఎవరు? అని ప్రశ్నించారు. ఉపా చట్టానికి ట్రయల్ ఉండదని, బెయిల్ ఉండదని దుర్మార్గమైన చట్టమని విమర్శించారు. ఉపా చట్టంలో అరెస్టు అయిన వారిలో కేవలం మూడు శాతం వరకే నేరాలు నిరుపించారని, 97 శాతం నిరూపణ కాలేదని తెలిపారు. సాయిబాబాను పదేళ్లు జైల్లో పెట్టారని, చేతులు కాళ్లు పని చేయని సాయిబాబాను సెల్‌లో నిర్బంధించి, త్రీవంగా హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా మరణం రాజ్యం చేసిన కక్షనే అని అన్నారు. ఈ నిరసన దీక్షలో మానవ హక్కుల సంఘం నాయకుడు అన్వర్ ఖాన్, సీపీఐ సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.చాయాదేవి, యాదగిరి, స్టాలిన్, ఎం.ఆదిరెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నాయకులు భల్లా రవి పాల్గొన్నారు.

నిరసన దీక్షలో ప్రొఫెసర్ హరగోపాల్, చాడ వెంకట్ రెడ్డి తదితరులు

ఓయూలో.. పోలీసు పికెటింగ్

గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలనే అభ్యర్థుల ఆందోళనల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం విద్యార్థుల ర్యాలీలు, ధర్నాలను నిలువరించేలా పోలీసులు భారీ బందోబస్త్ నిర్వహించారు. ఈ క్రమంలో యూనివర్సిటీ పరిధుల్లో పోలీసుల సంచారం అధికమైంది. నిత్యం ఉద్యోగార్థులు, విద్యార్థులతో కిటకిటలాడే యూనివర్సిటీ గ్రంథాలయం సందడిని కోల్పోయి నిర్మానుష్యంగా కనిపించింది.

డిసెంబర్‌లోగా సీవరేజీ టన్నెలింగ్

క్షేత్ర స్థాయి పనుల పరిశీలనలో జల మండలి ఎండీ

సిటీబ్యూరో, అక్టోబరు 17(నమస్తే తెలంగాణ): సీవరేజి ఓవర్ ఫ్లో నివారణపై జల మండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఓ అండ్ ఎం డివిజన్ - 5 పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎండీ అశోక్ రెడ్డి పర్యటించారు. బర్కత్‌పుర, బాగ్ లింగంపల్లి ప్రాంతాల్లో చేపడుతున్న డీ సిల్టింగ్, సీవరేజ్ టన్నెలింగ్ పనులను పరిశీలించారు. కింగ్ కోఠి, కాచిగూడలో జరుగుతున్న సీవరేజి టన్నెలింగ్ పనులను ఎండీ పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని, అవసరమైతే రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టాలని ఎండీ సూచించారు. పనులు జరిగే సమయంలో రక్షణ చర్యలను పాటించాలన్నారు. ఈ రెండు ప్రాంతాల్లో జరుగుతున్న టన్నెలింగ్ పనులు దాదాపు కింగ్ కోఠి వద్ద 200 మీటర్లు, కాచిగూడ వద్ద 200 మీటర్లు, బషీర్‌బాగ్ వద్ద 200 మీటర్లు టన్నెలింగ్ పనులు పూర్తి చేయనున్నారు.

గోదావరి జలాలకు ప్రభుత్వ విప్ ఐలయ్య పూజలు

గుండాల మోడల్ స్కూల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు

గుండాల, అక్టోబర్ 17 : మండలంలోని వస్తాకొండూర్ - పెద్దపడిశాల గ్రామాల మధ్య బిక్కేరు వాగులో ఉన్న చెక్‌డ్యాం వద్ద గోదావరి జలాలకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ బిక్కేరు వాగులో నీరు పారితే బోర్లు, బావుల ద్వారా వ్యవసాయానికి సరిపడా సాగునీరు లభిస్తుందన్నారు. మంత్రుల సహకారంతో చెరువులు నింపేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, నాయకులు యాదగిరి, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, విశాలాక్షి, హరితాదేవి, నారాయణ, నరేశ్, ప్రకాశ్, సైదులు, వెంకన్న, భిక్షం, ఆంజనేయులు ఉన్నారు.

మోడల్ స్కూల్లో మౌలిక వసతులు కల్పించాలని వినతి

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో మౌలిక వసతులు కల్పించాలని పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి పత్రం అందజేశారు. తమ పాఠశాలకు తాగునీరు అందించాలని, వర్షం కురిసిన సమయంలో పాఠశాల ఆవరణలో నీరు నిలిచి బురదమయంగా ఉంటుందని, మట్టి పోయించాలని విద్యార్థులు కోరారు.

గ్రూప్-1 పరీక్షను రీషెడ్యూల్ చేయాలి: ప్రొ॥ వినోద్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: తెలంగాణ రాష్ట్రంలో ఏడు శాతం జనాభా లేని అగ్రవర్ణాలకు యాభై శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్న జీవో 29ను తక్షణమే రద్దు చేసి, గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. జీవో 29ను వెంటనే రద్దు చేయాలని, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గ్రూప్-1 అభ్యర్థులు గురువారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, 30 లక్షల నిరుద్యోగుల సహకారంతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవో 29ని తీసుకువచ్చి 93 శాతం జనాభా ఉన్న బహుజన నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. హైకోర్టులో టీజీపీఎస్సీపై 14 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్ని పరీక్షలు రద్దు చేసి కేవలం గ్రూప్-1 నోటిఫికేషన్‌లో 63 పోస్టులు కలిపి రీషెడ్యూల్ చేసిందని దుయ్యబట్టారు. జీవో 29ని తీసుకువచ్చి, బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో జన పరిషత్ నాయకుడు విజయరాజ్, గ్రూప్-1 అభ్యర్థులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, చిత్రంలో తదితరులు

సత్సంగ ఆశ్రమం వార్షిక మహోత్సవం



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 : పట్టణంలోని అచల పరిపూర్ణ సత్సంగ ఆశ్రమం 35వ వార్షిక మహోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో మేలుకొలుపు, అఖండ దీపారాధన, లఘుపూజ, నగర సంకీర్తన, ధ్వజారోహణం, గురుపూజ, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సత్సంగ మండలి అధ్యక్షుడు చక్రాల నర్సింహ, కార్యదర్శి దోర్నాల నర్సింహ, ప్రతినిధులు బోగ సురేశ్, కొంగరి బాలనర్సింహ, తడక ముత్యాలు, మాధవులు, వాసుదేవ్, రామచంద్రం, నర్సింహ, మహేశ్, మల్లేశ్, యాదమ్మ, నిర్మలానంద, చంద్రకళ, లలిత, అంజమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండాలి : ఎంపీడీఓ

మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 17 : ప్రతి గ్రామం పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే కోసం పాటించవలసిన నియమ నిబంధనలను వివరించారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

పోచంపల్లి పీహెచ్‌సీలో రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 : వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మాసిస్ట్ రిజిస్టర్ల తనిఖీ, రికార్డుల పరిశీలన, మందులు స్టాక్ రిజిస్టర్, మందుల నిల్వ, ఓపీ రిజిస్టర్, ఇన్, అవుట్ పేషెంట్ల రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో గదులు, దవాఖాన నిర్వహణ తీరును పరిశీలించారు. రోజూ ఎంత మంది పేషెంట్లు వస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా విషజ్వరాల కేసులు ఎన్ని వస్తున్నాయని అడిగి, సరిపడా రాపిడ్ కిట్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలు పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట స్టాఫ్ నర్సు కృష్ణవేణి, ఫార్మాసిస్ట్ ప్రదీప్‌కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కొయ్యలగూడెంలో విదేశీయుల పర్యటన

కొయ్యలగూడెంలో టై అండ్ డై చేనేత పని విధానాన్ని పరిశీలిస్తున్న విదేశీయులు

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 17 : మండలంలోని కొయ్యలగూడెం గ్రామాన్ని యుకే దేశీయులు గురువారం సందర్శించారు. చేనేత మగ్గాలపై తయారీ అవుతున్న చేనేత వస్త్రాలను, టై అండ్ డై రంగుల అద్దకం విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో చేనేత కార్మికుడు దుగ్యాల శంకర్ తయారు చేస్తున్న రంగుల అద్దకాన్ని చూసి చేనేత టై అండ్ డై వస్త్రాల ఉత్పత్తి విధానం అద్భుతమని కితాబిచ్చారు. చేతిపై చేస్తున్న అందమైన వస్త్రాల తయారీని కొనియాడారు.